క్లుప్తంగా

గ్రామ దేవతలకు బోనాలు



అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెంలో రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని గురువారం మహిళలు అధిక సంఖ్యలో గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. బొడ్రాయి, ముత్యాలమ్మకు నీళ్ల పోసి పొంగళ్లు పొంగించారు. మొక్కులు తీర్చుకున్నారు.

50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రాజుపాలెం: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ వేణుగోపాల్, సిబ్బంది కొండమోడు జంక్షన్‌లో గురువారం పట్టుకున్నారు. కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీకి చెందిన ఎస్కే అన్వర్ బాషా మండలంలోని డీలర్ల వద్ద 50కిలోల బరువు గల 50 బస్తాలను కొనుగోలు చేసి, తీసుకువెళ్తున్నాడు. అన్వర్ బాషపై కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేశారు. బియ్యాన్ని రాజుపాలెం గోదాంకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ముంపు పొలాల పరిశీలన



అమరావతి: అమరావతి, వైకుంఠపురం, పెదమద్దూరు గ్రామాల్లో కృష్ణా నది వరదల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలను గురువారం వ్యవసాయశాఖాధికారులు సందర్శించారు. పరిశీలన అనంతరం ఏడీఏ హనుమంతరావు, ఏఓ అహ్మద్ మాట్లాడుతూ వీఆర్వో, వీఏఏ బృందంగా నీట మునిగిన పొలాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు బృందానికి సహకరించాలని కోరారు.

ముప్పాళ్ల ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ముప్పాళ్ళ: ముప్పాళ్ల ఎస్ఐగా ఉయ్యూరు సోమేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వట్టిచెరుకూరు మండల ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన బదిలీలో ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పనిచేసిన పి.హజరత్తయ్య స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ అయ్యారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

బెల్లంకొండ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ




బెల్లంకొండ: నూతన ఎస్ఐగా రాజా గురువారం బాధ్యతలు స్వీకరించారు. హెడ్ క్వార్టర్స్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ, బదిలీపై ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐగా పనిచేస్తున్న రాజేష్ వీఆర్‌కు వెళ్లారు. ఎస్ఐ రాజా గతంలో మాచవరం, నకరికల్లు మండలాల్లో పనిచేశారు. మండలంలోని అన్ని గ్రామాలపై పూర్తి అవగాహన ఉందని ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదకూరపాడు: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పెదకూరపాడు ఎస్ఐ బాలూ నాయక్ గురువారం తెలిపారు. మండలంలోని పాడపాడు గ్రామానికి చెందిన కసారబాధ శివకుమారి (55) గత బుధవారం పాడపాడులోని తన నివాసంలో ఉదయం 11 గంటల కనిపించకుండా పోయిందని భర్త సాంబయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శివకుమారి కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నట్లు చెప్పారు.

పౌష్టికాహారంపై అవగాహన



ఆవులవారిపాలెం(క్రోసూరు): అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అవులవారిపాలెం, పెరికపాడు తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాల తయారీ విధానాన్ని వివరించారు. ఏఎన్ఎం మల్లేశ్వరి గర్భిణులకు, బాలింతలకు హెచ్‌బీ శాతం పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు మాధవి, నిర్మల, అనసూర్య, అంజలి, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు మాజేటి రాము మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్‌ను అదర్శంగా తీసుకోవాలని, ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా విద్యను నలుగురికి పంచే గురువులను పూజించడం విద్యార్థుల బాధ్యతన్నారు.

• స్థానిక సరస్వతీ శిశు మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. పాఠశాల పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాధాకృష్ణన్ అంతటివారు కావాలి

క్రోసూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి గొప్ప విద్యావేత్తలు కావాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం జి.రామాంజనేయులు, ఉపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి, సురేష్, రామారావు, త్రినాథ్, శ్రీధర్, హరిప్రసాద్, జ్యోత్స్న చందన హారతి, లీలా, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం

ముప్పాళ్ళ: మండలంలోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. దమ్మాలపాడు గ్రామంలోని ఎంపీపీఎస్(రామాపురం) పాఠశాలలో హెచ్‌ఎం అచ్చయ్య, ఉపాధ్యాయులు మువ్వా సురేష్, సతీష్, వేణుమాధవి, నాగేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బద్దిగం వీరారెడ్డి పాల్గొన్నారు.



అమరావతి: రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళి



క్రోసూరు జెడ్పీ పాఠశాలలో గురువులను సత్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



దమ్మాలపాడు ఉపాధ్యాయుడికి సన్మానం



నకరికల్లు : చీమలమర్రిలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు విద్యార్థుల నివాళి

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు ఎంపీపీ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందించే గురువులను గౌవరించాలన్నారు. జాతీయ చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పించారు.

నకరికల్లు: గురుపూజోత్సవాలను మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయాపాఠశాలల్లో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఘనసన్మానం చేశారు.

చవితి నిర్వహణకు సంపూర్ణ సమాచారం ఇవ్వాలి

అచ్చంపేట: గణపతి ఉత్సవాల నిర్వహణ సంపూర్ణ సమాచారమిచ్చి, ప్రభుత్వ అనుమతులతో వినాయక విగ్రహాలు నెలకొల్పాలని తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్, ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకులకు విగ్రహాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. తహసీల్దారు మాట్లాడుతూ కృష్ణానది పొంగుతున్నందున ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొల్పే విగ్రహాలు పుట్లగూడెం వద్ద కృష్ణా నదిలో మాత్రమే నిమజ్జనం చేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, వీర్వోలు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం మాట్లాడుతూ వినాయక చవితి మండపాల విద్యుత్ సరఫరాకు ముందుగా చలానా చెల్లించి, విద్యుత్ శాఖ అనుమతితో వాడుకోవాలన్నారు. పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు వెంకట ప్రసాద్ మాట్లాడుతూ వినాయకుని ఉత్సవాలకు విగ్రహాలు నెలకొల్పేవారు 99950 95800 ఫోన్ నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెస్సేజ్ చేస్తే దరఖాస్తు ఫామ్ వస్తుందన్నారు. అందులో వివరాలన్నింటిని పొందు పరిచి, చలానాల కాపీలన్నీ అప్‌లోడ్ చేస్తే..డీఎస్పీ లాగిన్‌లో అప్రూవల్ వస్తుందన్నారు. అనుమతి కాపి వచ్చిన తర్వాతే ఉత్సవాలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. http//fanerhurtrhav.net.ap వెబ్‌సైట్ ద్వారా కూడా ధరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎన్ని విగ్రహాలైనా నెలకొల్పవచ్చని చెప్పారు.



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసయాదవ్, పక్కన ఎంపీడీఓ, సీఐ

మహిళా పోలీసులకు అవగాహన

క్రోసూరు: వినాయక చవితి సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసే మండపాలకు నిర్వాహకులు పాటించాల్సిన విధి విధానాలపై గురువారం మహిళా పోలీసులకు ఎస్ఐ కె.నాగేంద్రరావు అవగాహన కల్పించారు. విగ్రహ కమిటీ అనుమతుల కోసం సింగిల్ విండో పద్ధతి అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కమిటీ సభ్యుల పర్యవేక్షణ, సీసీ కెమెరాల ఏర్పాటు, డీజేపై శిక్షణనిచ్చారు.

ఉపాధ్యాయులకు అవార్డు ప్రదానం



పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం బసవరాజు



పురస్కారం అందుకున్న ఉపాధ్యాయురాలు సీహెచ్ అమృతవాణి

సత్తెనపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపరాజు బసవరాజు, పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ)లో తెలుగు ఉపాధ్యాయురాలు సీహెచ్ అమృత వాణి గురు పూజోత్సవం సందర్భంగా నరసరావుపేటలో అవార్డు అందుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంసా పత్రం, సత్కారం స్వీకరించారు.

ఉత్తమ పీఈటీ సాంబశివరావు



గండు సాంబశివరావు

88త్యాళ్లూరు(క్రోసూరు): గురు పూజోత్సవం సందర్భంగా గురువారం విద్యాశాఖ ఎంపిక చేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల్లో 88 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉపాధ్యాయుడు గండు సాంబశివరావు ఉన్నట్లు హెచ్‌ఎం వి.లక్ష్మీనారాయణ తెలిపారు. నరసరావుపేటలో జరిగిన సన్మాన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారని చెప్పారు.

ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

నకరికల్లు: మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. గుండ్లపల్లి ఉన్నత పాఠశాలలోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు షేక్.నజీర్ అహ్మద్, నకరికల్లు ఉన్నత పాఠశాలలోని ఎస్ఏ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎం.జె.అశోక్, ఎస్ఏ తెలుగు ఉపాధ్యాయుడు సీహెచ్.చిన ఓబయ్య, కుంకలగుంట ఉన్నత పాఠశాలలోని ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు కుంభా కోటేశ్వరి, గుండ్లపల్లి ఎంపీపీ పాఠశాలలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు సుకుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఈ మేరకు ఉత్తమ ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రూ.20 వేలు నష్ట పరిహారం అందించాలి

క్రోసూరు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పత్తి సాగు చేపట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరాకు రూ.20 వేలు పంట నష్ట పరిహారం అందించాలని సీపీఎం , ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశాయి. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో సీపీఎం, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడారు. గత పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మండల పరిధిలో పత్తి పంట నష్టపోయిన రైతులు ప్రతి గ్రామంలో ఉన్నారని తెలిపారు. పంటలు దెబ్బతిన్న రైతులు స్థానిక రైతు సేవా కేంద్రం అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాలని తెలిపారు.



వర్షాలకు ఉరకేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిసెట్టి హనుమంతరావు, కౌలు రైతులు మధుసూదన్ రావు , బండి మందిరం పాల్గొన్నారు.

పంటలను కాపాడుకోవాలి

ముప్పాళ్ళ: ముంపునకు గురైన వరి, పత్తి పంటలను యాజమాన్య పద్ధతులు పాటించి కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.అరుణ తెలిపారు. గురువారం ముప్పాళ్ళ, లంకెలకూరపాడు గ్రామాల్లోని వరి, పత్తి పంటలను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పంటకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. వీలైనంత త్వరగా నిలిచిన నీటిని పూర్తిగా బయటకు పంపడం వల్ల నష్ట నివారణ సాధ్యమన్నారు. పంటను కాపాడుకునేందుకు పలు సూచనలు చేశారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ అరుణ

మాజీ ఎంపీ సురేష్ అరెస్ట్ అక్రమం

సత్తెనపల్లి: టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినా అక్రమంగా, చట్ట విరుద్ధంగా దళిత సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్ట్ చేయడం అక్రమం, అన్యాయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలకా జైపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ కి తరలించడాన్ని ఆయన ఖండించారు. గురువారం సత్తెనపల్లి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక దళిత సామాజిక వర్గాల నేతలపై అమానుష చర్యలకు పాల్పడుతోందన్నారు. తప్పుడు కేసులో వైఎస్సార్ సీపీ నేతలను ఇరికించి, వేధించడం సరైనది కాదన్నారు. మాజీ ఎంపీ నందిగామ సురేష్‌ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో వరద వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే కూటమి ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

వాహనాల తనిఖీ



సత్తెనపల్లి: లైసెన్స్, పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓ పోలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన పత్రాలు, సైలెన్సర్లు లేని, మైనర్లు నడిపే వాహనాల తనిఖీ చేపట్టారు. 111 వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, ఐదుగురు ఎస్ఐలు, 18 మంది ఏఆర్ సిబ్బంది, పట్టణ పోలీసులు, తదితరులు ఉన్నారు.

అవసరం మేరకే సాగర్ జలాల వినియోగం

ఎన్ఎస్పీ లింగంగుంట్ల ఎస్ఈ వరలక్ష్మి

సత్తెనపల్లి: సాగర్ కుడి కాల్వ ద్వారా వస్తున్న జలాలను వృథా చేయకుండా అవసరం మేరకే వినియోగించుకోవాలని ఎన్ఎస్పీ లింగంగుంట్ల ఎస్ఈ డి.వరలక్ష్మి అన్నారు. 36 ఎల్ అమరావతి మేజర్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సాగర్ జలాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఈ మురళీధర్, డీఈఈ హరికృష్ణ, ఏఈలు డి.సుందరావు, చిరంజీవి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.



అమరావతి మేజర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వరలక్ష్మి

ప్రకృతి వ్యవసాయంతో పంటలకు రక్షణ

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సయ్యద్ బాజీబీ, షేక్ మస్తాన్ వలి సాగు చేస్తున్న పత్తి పంటను జిల్లా ఎన్ఎఫ్ఏ టి.సైదయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు అధికంగా ఉండడం వల్ల పత్తి పంటను ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా కాపాడుకోవచ్చునన్నారు. పొలంలోని నీటిని తొలగించి, 100 కిలోల ఘన జీవామృతం, 50 కిలోల వేప పిండి కలిపి మొక్కల మొదల దగ్గర వేయాలన్నారు. దీంతో తక్షణం పోషకాలు అంది, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అనంతరం 150 లీటర్ల నీటికి 30 లీటర్ల ద్రవ జీవామృతం కలిపి మొక్క పూర్తిగా తడిసే విధంగా పిచికారి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అరుణ, రైతులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

రాజుపాలెం: కంది సాగులో అంతర పంటలుగా పత్తి, పెసర, అలసంద, సజ్జ, గోరుచిక్కుడు పంటలు వేయడం వలన జీవవైవిధ్యం బాగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెంలో యువ మహిళా రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలను గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పీఎండీఎస్, గణ జీవామృతం పాటించడం వలన అతి తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ విధానం వలన భూమిని సారవంతం చేసే వ్యవసాయం చేయవచ్చని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంటీ అంజలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌తో రైతులకు నిరంతర ఆదాయం

పకృతి వ్యవసాయం డీపీఎం అమల కుమారి

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్‌తో సాగు చేయడం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డి పాలెంలో గురువారం పకృతి వ్యవసాయ ద్వారా ఏటీఎం మోడల్‌లో మహిళా రైతు జ్యోతి సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఈ మోడల్‌లో మొత్తం 27 రకాల పంటలు కూరగాయలు, ఆకు కూరలు, దుంప, తీగ జాతులు ఒకే పొలంలో సాగు చేయొచ్చన్నారు. ఈ విధంగా పలు పంటల వేయడం వల్ల జీవ వైవిధ్యం పెరిగి, అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.టి అంజలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకట శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వరద బాధితులకు ఆపన్న హస్తం అందించాల్సిన అవసరం ఉందని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని వరద బాధితులకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆహారం, తాగునీరు సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ అధికారులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకునేందుకు న్యాయవాదులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. న్యాయమూర్తులు తౌషిద్ హుస్సేన్, పి.ప్రియ దర్శిని, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్, తహసీల్దార్ కె.శ్రీనివాసచక్రవర్తి, ఏజీపీ షేక్ బాలిసైదా, న్యాయవాదులు మార్కురావు, వెంకటకోటయ్య, వీరయ్య, సంగీతరావు, ఏసురత్నం, రామాంజనేయులు, హరినాథ్, విజయ భారత్, మదన గోపాల్, మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు లక్ష్మీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహారం, మంచినీరు పంపుతున్న న్యాయమూర్తులు



విరాళాలు సేకరిస్తున్న ఆర్య వైశ్య సంఘాల ఐక్య వేదిక నాయకులు

• విజయవాడ వరద బాధితుల కోసం సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య పట్టణంలోని ప్రధాన వీధుల్లో గురువారం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయ నాయక్, మండల నాయకులు పాల్గొన్నారు.

• విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆర్య వైశ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. డోర్ టూ డోర్ తిరిగి రూ.36,560 సేకరించినట్లు నాయకులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, నాయకులు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, అన్నం బాలసుబ్రమణ్యం, శివకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, దేవరపల్లి కాశీ, కొప్పురావూరి కాశీ, సుబ్రమణ్యం, రామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడే వారు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎల్ఐసీ సత్తెనపల్లి బ్రాంచ్ మేనేజర్ సురేష్ బాబు అన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ 68వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం హెల్త్ డేని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విజయ శారద హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ ఆళ్ల శారద సేవలు అందించారు. ఎల్ఐసీ సిబ్బంది, ఏజెంట్లు, పాలసీదారులు హాజరై బీపీ, షుగర్ టెస్టులు చేయించుకున్నారు. బ్రాంచ్ మేనేజర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎల్ఐసీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ లో భారత దేశంలో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఏవో కృష్ణారావు, సిబ్బంది కోటి లింగం, వంశీ, రేచల్ నాయక్, ఏజెంట్లు విష్ణు, రంగారావు, పవన్‌కుమార్, కోటేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.